ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025 5 విజయనగరం



తాటిపూడిలో పెరిగిన నీటిమట్టం



గేట్లు ఎత్తివేయడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి-గంట్యాడ

మూడు రోజులుగా కురిసిన వర్షాలతో తాటిపూడి రిజర్వాయర్ నీటిమట్టం పెరిగింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 297 అడుగులు కాగా, మంగళవారం రాత్రికి 294.30అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్ లోపలకు 4755 క్యూసెక్కుల నుండి 5335 క్యూసెక్కుల నీరు రావడంతోఅప్రమత్తమైన అధికారులు మూడు గేట్లను ఎత్తివేశారు. నదిలోకి 6800 క్యూ సెక్కుల నుండి 9114 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ముందు జాగ్రత్త చర్యగా గోస్తనీ నది పరివాహక వరద ప్రభావిత ప్రాంతాలకు సమాచారం అందజేసినట్లు ఎఇ శంకర్ తెలిపారు.


గుర్ల మండలం పాలవలసలో నేలకొరిగిన బొప్పాయి


మెరకముడిదాం మండలం గాతాడలో నీట మునిగిన వరిచేను


విజయనగరం పూల్‌బాగ్‌లో కూలిపోయిన ఇంటి గోడ

అన్నదాత అతలాకుతలం

- మొంథా మిగిల్చిన అపార నష్టం
- 4048 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- అస్తవ్యస్తంగా మారిన 100 కిలోమీటర్ల ఆర్అండ్‌బి రహదారులు
- దెబ్బతిన్న 90కు పైగా ఇళ్లు
- ప్రమాద స్థితిలో 135 చెరువులు
- మూడు పశువులు మృత్యువాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మూడు రోజులపాటు భారీ వర్షాలు, పెనుగాలులతో భీభత్సం సృష్టించిన మొంథా తుపాను జిల్లాకు తీవ్ర నష్టాన్ని, ప్రజలకు కష్టాన్ని మిగిల్చింది. ఇరిగేషన్, విద్యుత్, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి కంటిమీద కునుకులేకుండా చేసింది. విద్యార్థులను తరగతి గదులకు దూరం చేసింది. ముఖ్యంగా పొట్ట, వెన్నుదశలో ఉన్న వరి పంట వేలాది ఎకరాల్లో నీటమునిగింది. రోడ్లు, ఇళ్లు, పశువుల శాఖలు ఊహించని రీతిలో దెబ్బతిన్నాయి. పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. ఇలా చెప్పకుంటూ పోతే తుపాను మిగిల్చిన నష్టం భారీగానే ఉంది.

సోమవారం ప్రారంభమైన మొంథా తుపాను బుధవారం రాత్రి వరకు కొనసాగింది. భారీ వర్షాలు, గాలుల తీవ్రతతో నష్టం రూ.కోట్లలోనే చవి చూడాల్సివచ్చింది. తుపాను ముందు వరకు కురిసిన వర్షాలు దిగుబడిపై ప్రభావం చూపగా, అరకొర దిగుబడిపై మొంథా తుపాను మొత్తంగా ముంచేసింది. అధిక వర్షాల కారణంగా ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఫుట్‌పాత్, తోపుడు బండ్ల వ్యాపారాలు నిలిచి పోయాయి. అత్యవసర పరిస్థితుల్లో మినహా ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సివచ్చింది. పలు రైళ్లను కూడా రద్దుచేశారు. బస్సులు కూడా వర్ష ప్రభావాన్ని పరిమితంగానూ, ఆలస్యంగాను నడిచాయి. వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సుమారు 4083 ఎకరాల్లో నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న రైతులు బాగా నష్టపోయారు. రెవెన్యూ శాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 90ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇందులో 10పక్కా ఇళ్లు, 54 మిద్దె ఇళ్లు, 26 గుడిసెలు ఉన్నాయి. గాలుల కారణంగా పలు చోట్ల విద్యుత్ శాఖకు నష్టం, విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం.... 46 విద్యుత్ స్తంభాలు, 15ఫీడర్లు, 3 ట్రాన్సఫార్మర్లు దెబ్బతిన్నాయి. మరో 3 విద్యుత్ సబ్ స్టేషన్లలో కూడా నష్టం వాటిల్లింది. మొత్తంగా రూ.3.30లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఎపి ట్రాన్స్‌కో అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 15 రహదారుల్లో ఆర్అండ్‌బి రహదారులు 100కిలో మీటర్ల మేర దెబ్బతిన్నాయి. ఈ నష్టం రూ.41కోట్ల మేర ఉంటుందని అంచనాలు రూపొందించడం గమనార్హం. జిల్లాలో మొత్తంగా 135 చెరువులు ప్రమాద స్థితికి చేరాయి. దీంతో, చాలా చోట్ల ఇరిగేషన్ శాఖ అధికారులు గట్లు విరగ్గొట్టి నీటిని మళ్లించారు. మిగిలినచోట్ల గట్లు బలహీన పడకుండా ఇసుక బస్తాలను అడ్డుగా పెట్టారు. ఈ నష్టం రూ.15.50కోట్లు ఉంటుందని ఆశాఖ అధికారులు అంచనా రూపొందించారు. మంగళ, బుధవారాల్లో మూడు పశువులు శాలలు దెబ్బతిన్నాయి. మూడు మృత్యువాత పడ్డాయి.

పంటలను పరిశీలించిన జెడ్‌పి చైర్మన్

రాజాం : మండలంలోని లక్ష్మీపురంలో నీటమునిగిన వరి పంట పొలాలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ పంట నష్ట పరిహారం నమోదు పారదర్శకంగా జరగాలని, విరిగిన చెట్లను, కరెంటు స్తంభాలు, వైర్లను యుద్ధ ప్రాతిపదిగిన తొలగింపు చర్యలను చేపట్టాలని అధికారు లకు సూచించారు. ఆయన వెంట వైసిపి నాయ కులు, అధికారులు ఉన్నారు.


వరిచేలను పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

పొంగిప్రవహిస్తున్న చింతగెడ్డ

వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లు తున్నాయి. చిన్న కంచరాం గ్రామ సమీపంలోని చింతగెడ్డ ఉప్పొం గింది. దాంతో లోలెవల్ వంతెనపై నుండి ప్రమాదకరంగా వరదనీరు ప్రవహించడంతో రాజాం నుండి సుమారు ఐదు గ్రామాలకు వెళ్లే ప్రజల రాకపోకలు స్తంభించాయి. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే సమస్య ఎదురవుతుందని స్థానికులు వాపోతున్నారు.


గంగచోళ్ల పెంటలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

కూలిన ఇంటిని పరిశీలించిన మంత్రి

గజపతినగరం: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గంగోచోళ్ళపెంట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఇల్లు కూలింది. బుధవారం మంత్రి శ్రీనివాస్ దృష్టికి స్థానిక నాయకులు తీసుకొని వెళ్లడంతో ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కూలిన ఇంటిని పరిశీలించారు. అనంతరం గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో గర్భిణులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డెలివరీకి సిద్ధంగా ఉన్న 360 మంది గర్భిణులను దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సచివాల స్థాయి నుంచి పట్టణాల వరకు విద్యుత్, వైద్య, ఇరిగేషన్ సంబంధిత శాఖ అధికారులను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రతిక్షణం పర్యవేక్షించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, నాయకులు వివి ప్రదీప్ కుమార్, రామ్ కుమార్, ఆంధ్ర రిజర్వాయర్ చైర్మన్ సతీష్, టిడిపి నాయకులు కనకల మురళి, కనకల రామానందం, బొత్స రమణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షా సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంత్రి మండల స్థాయి అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు నష్టం వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి నివేదికలను అడిగి తీసుకున్నారు. వరి ముంపునకు గురైన చోట రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ఏడికి సూచించారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

- తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-రామభద్రపురం

తుపాను ప్రభావం కారణంగా నష్టపోయిన రైతులను, ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రైతులకు పత్తి పంటకు ఎకరాకు రూ.10వేలు, వరికి రూ.30వేలు చెల్లించాలని, రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు శాశ్వత ప్రాతిపదికన వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన రామభద్రపురం మండల కేంద్రం, ఇట్లా మామిడిపల్లి, సోంపురం గ్రామంలో పర్యటించారు. తుపాను కారణంగా నేలకొరిగిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 447మంది రైతులకు చెందిన 706 ఎకరాల వరి పంట, 6118 ఎకరాల్లో పత్తిపంట, 24,945 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నష్టపోయాయని వెల్లడించారు. విజయనగరం, బొండపల్లి డెంకాడ, పూసటిరేగ, మెంటాడ మండలాల్లో 15ఇళ్ల గోడలు కూలి,పెచ్చులు ఊడి దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 102 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ సదుపాయాలు లేక కొన్నిచోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించారు. తుపాను కారణంగా రాకపోకలు నిలిచిపోయిన గ్రామాలకు శాశ్వత ప్రాతిపదికన వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శ్రీను, ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఇట్లామామిడిపల్లిలో కుళ్లిపోయిన పత్తిపంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కలెక్టర్‌ను అభినందించిన సిఎం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మొంథా తుపాను సమయంలో తుపాను సమయంలో జిల్లా యంత్రాంగం ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవడం, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం, ప్రజలకు తక్షణ సహాయం అందించేలా చురుకైన చర్యలు తీసుకోవడంతో కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డిని, జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం జిల్లాలోని తుపాను ప్రభావం, నష్టాలు గురించి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి అభినందనలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తుఫాన్ సమయంలో ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అవసరమైన సరకులు అందించడం, సమాచారాన్ని నిరంతరం కలెక్టరేట్ కు చేరవేయడం వంటి విధుల్లో చూపిన అంకితభావం ప్రజలకు రక్షణ కవచంగా మారిందని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారని తెలిపారు.


కొత్తవలసలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

పలు ప్రాంతాల్లో ప్రత్యేకాధికారి పర్యటన

దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలని ఆదేశం

ప్రజాశక్తి-శృంగవరపుకోట, కొత్తవలస

జిల్లా ప్రత్యేకాధికారి రవి సుభాష్ పట్టంశెట్టి సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ తో కలసి బుధవారం జామి, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ మండలాల్లో పర్యటించి తుపాను నష్టాలను పరిశీలించారు. జామి మండలం లో భీమసింగి జంక్షన్ వద్ద ఆర్అండ్ బి రహదారిపై నీరు నిల్వ ఉండడం తో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీరు తగ్గే మార్గం చూడాలన్నారు. ఎస్.కోటలో సంతగౌరమ్మ పేటలో పర్యటించి రహదారులను పరిశీలించారు. ఎల్.కోట నుండి వేపాడ వెళ్లే మార్గం లో నున్న రైల్ అండర్ బ్రిడ్జ్ వద్ద నీరు నిల్వ ఉండడం తో వెంటనే నీరు తొడించాలని ఆదేశించారు. కొత్తవలస తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. వారి వెంట ఆయా మండలాల తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ప్రజాశక్తి - విజయనగరం కోట

మొంథా తుపాను తీరం దాటి నప్పటికీ జిల్లాలో బుధవారం వర్షాలు కొనసాగాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మెంటాడ మండలంలో 13.8మి.మీ, కొత్తవలసమండలంలో 13.02, దత్తిరాజేరు మండలంలో 10.6మి.మీ, వంగరలో 10.8మి.మీ వర్షం కురిసింది. వర్షాలతో వరి, మొక్కజొన్న, బొప్పాయి, పత్తి పంటలతో పాటు గా కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది.

పునరావాస కేంద్రాల్లో 107మంది

విజయనగరం మండలం పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు మొత్తం 107మంది తరలించినట్లు తహశీల్దార్ కూర్మనాథరావు తెలిపారు.పునరావస కేంద్రాలను తహశీల్దార్‌తో పాటు ఎంపిడిఒ వెంకటరావు, ఆర్ఐ రాజు సందర్శించి బాధితులకు ఇబ్బందులు లేకుండా చూశారు. బాబా మెట్ట లో గోడ కూలిన పూరింటిని, దుప్పాడ పూరి ఇంటిని పరిశీలించారు.

చెరువులను పరిశీలించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తుపాను ప్రభావంతో నగరంలోని చెరువులను టిడిపి నగర అధ్యక్షులు గంటా రవి , పార్టీ నాయకులు కార్యకర్తలు పరిశీలించారు. చెరువులన్నీ నిండిపోవడంతో అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో14వ డివిజన్ ఇంఛార్జ్ మద్దాల నాగ కుమారి , 50వ డివిజన్ ఇంఛార్జి ఝాన్సీ , యూనిట్ ఇంచార్జ్ తోట రమేష్ పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

- పంటలకు నష్టపరిహారం చెల్లిస్తాం
- జగన్నాథపురం కాజ్‌వే, కూనేటి గెడ్డకు నిధులు
- గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

తుపాను వల్ల నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని, అందరికీ పరిహారం చెల్లిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో ముంపునకు గురైన మెంటాడలోని కెజిబివి పాఠశాలను మంత్రి బుధవారం పరిశీలించారు. ఇక్కడ విద్యార్థులను మంగళవారం రాత్రి ముందు జాగ్రత్త చర్యగా అధికారులు జెడ్‌పి హైస్కూలుకు తరలించారు. ఈనేపథ్యంలో పర్యటించిన మంత్రి అధికారులతో సమావేశమై శాఖల వారీ నష్టం, సహాయక చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముంపుకు గురైన కెజిబివి పాఠశాలను పరిశీలించారు. అనంతరం కెజిబివి విద్యార్థులున్న పునరావాస కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మంత్రి సంధ్యారాణి మాట్లాడారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పంటలకు నష్టపరిహారం అందిస్తామని అన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సాలూరులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించా మన్నారు. మెంటాడలో అవసరం అనుకుంటే కొనుగోలు కేంద్రం తెరువాలని అధికారులను ఆదేశించారు. జగన్నాథపురం కాజ్‌వే, బడేవలస, కూనేటి గెడ్డ గండి కొట్టడం వలన ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వీటి పనులకు రూ. ఆరు లక్షలు అవసరం అవుతుందని వెంటనే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌తో మాట్లాడుతూ ఫోన్లో ఆదేశించారు. గిరిజనల గ్రామాలకు నిత్యావసర సరుకులు ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలపై తీసుకొని వెళ్లి పంపిణీ చేయాలని తహశీల్దార్‌కు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ భానుమూర్తి, టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం, రెడ్డి ఎర్నానాయుడు తదితరులు పాల్గొన్నారు.


కెజిబివి విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

తుపాను నష్టాలను తక్షణమే పంపాలి : కలెక్టర్

ప్రజాశక్తి -కంటోన్మెంట్ / తెర్లాం

తుపాను వల్ల సంభవించిన నష్టాలను వెంటనే పంపాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. శాఖల వారీగా జరిగిన నష్టాలను తెలియజేస్తూ వాటి పునరుద్ధరణకు అయ్యే ఖర్చు అంచనాలను కూడా పంపాలని తెలిపారు. నష్టాల అంచనాలు ఖచ్చితంగా ఉండాలని, ప్రత్యక్షంగా చూసి రాయాలని, వాటి ఫోటోల తో సహా పంపాలని తెలిపారు. బుధవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వారీగా అన్ని శాఖలకు సంబంధించిన నష్టాల పై ఆరా తీశారు. తాత్కాలిక పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని, శాశ్వత పనుల కోసం అంచనాలను తయారు చేసి పంపాలని అన్నారు. వేటకు వెళ్లని కారణం గా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం ప్రకటించిన 50 కేజీ ల బియ్యం వెంటనే అందించాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు.


అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనలో భాగంగా బుధవారం తెర్లాం మండలంలోని గంగన్నపాడు గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి పరిశీలించారు. గ్రామంలో నర్సిపల్లి వారి బంద చెరువు ఓవర్ ఫ్లో కావడంతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో ఇరిగేషన్ ఎఇతో మాట్లాడి తక్షణం నీటి ప్రవాహం బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి మట్టం పెరిగిన ప్రాంతాల ప్రజలు అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వరద నీరు తగ్గిన తర్వాత గ్రామంలోని బోర్లు, హేండ్ పంపులు, నీటి ట్యాంకులలోని తాగునీటిని పరీక్షించి మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని, అప్పటివరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధ జలాన్ని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. తుపాను అనంతరం వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున గ్రామంలో శానిటేషన్ పనులు వేగవంతం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో బొబ్బిలి ఆర్డీవో రామ్మోహన్ రావు, తాహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ రాంబాబు, ఇరిగేషన్ ఎఇ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం : గంగన్నపాడులో నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మానవత్వం చాటుకున్న కలెక్టర్

గజపతినగరం : కలెక్టర్ రామసుందర్ రెడ్డి తుపాన్ ప్రభావిత మండలాల పర్యటనకు బయలుదేరిన సందర్భంగా గజపతినగరం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగినట్లు గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపించి, స్వయంగా దిగి, గాయపడిన వ్యక్తుల వద్దకు చేరుకున్నారు. బాధితుల స్థితిని తెలుసుకుని, అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించి తక్షణం ఆసుపత్రికి తరలించారు. ఎక్కడైనా ప్రమాదం, అత్యవసర పరిస్థితి ఉంటే మానవతా దృష్టితో స్పందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. గోల్డెన్ హవర్ లో అందించిన సాయం మనిషి ప్రణాలను కాపాడుతుందని తెలిపారు.కలెక్టర్ మానవతా స్పందనను చూసి అక్కడ చేరిన ప్రజలు ప్రశంసించారు. ప్రజలకు చేరువైన అధికారిగా ఆయన ప్రవర్తన మరోసారి వెలుగులోకి వచ్చింది.


జమ్ములో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

నగరంలో కమిషనర్ పర్యటన

నేలకొరిగిన చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం పర్యటించారు. నగరంలో అక్కడక్కడ నేలకొరిగిన వృక్షాలను నగరపాలక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన కమిషనర్ ఆదేశాలతో తొలగించారు. జమ్ము ,చిన్నిపల్లి వారి వీధి, ప్రశాంతి నగర్ తదితర ప్రాంతాల్లో చెట్లు, వాటి కొమ్మలు నేలకొరిగాయి. వాటిని గుర్తించిన సిబ్బంది తక్షణం ఆయా ప్రాంతాలకు వెళ్లి జెసిబిలు, కట్టర్ల సహాయంతో తొలగించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. రహదారులకు ఇరువైపులా చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రపరచాలని సూచించారు. అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా, రంగు మారిన నీరు సరఫరా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. తుపాను అనంతరం కొత్తనీరు వచ్చి చేరే అవకాశం ఉందని, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి కెఎల్ పురం ప్రాంతంలో నారాయణ చెరువు, సారె చెరువు, మహంతి చెరువులను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.

పారిశుధ్య పనుల్లో నగరపాలక సిబ్బంది

తుపాను అనంతరం వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా కాలువల్లో చెత్త చెదరాలను తొలగించే పనిలో నగర పాలక సిబ్బంది తలమునకలై ఉన్నారు. బుధవారం జెసిబిలు, బాబ్ కార్ట్‌ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు.

నేడు పలు ప్రాంతాలకు నీటి సరఫరా బంద్

విజయనగరం టౌన్ : కుదిపి, రామ తీర్థాలు పంపు హౌస్ దగ్గర ఇన్ ఫిల్ట్రేషన్ వెల్స్ ఎక్కువ వరద నీరు వచ్చి మునిగిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాలకు గురువారం నీటి సరఫరా జరగదని కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రింగ్ రోడ్, కొత్తపేట యాత వీధి , కోలగట్ల వీధి, కోరాడ వీధి, చందాల వారి వీధి, లంక వీధి, సూర్యనగర్, తుపాకుల వీధి, విటి అగ్రహారం, కొత్త అగ్రహారం, డక్కిన వీధి, నాగవంశం వీధి, కనపాక, పావని నగర్, చందక వీధి, గొల్ల వీది, సాయి బాబా కాలనీ, శివాలయం, రోడ్, చెన్నారెడ్డి కాలనీ గంజిపేట, రెల్లివీధి అయ్యన్న పేట తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

గో సంరక్షణ రాష్ట్ర కమిటీలోకి శాంతి, దేవి

విజయనగరం టౌన్ : రాష్ట్రం లో గో సంరక్షణకు, జంతు సంక్షేమానికి విశిష్ట సేవలు అందించాలని రాష్ట్ర స్థాయిలో పదవీ బాధ్యతలు అప్పగిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ. రామకృష్ణ అన్నారు. జిల్లా నుండి కొన్నేళ్లగా సేవలు అందిస్తున్న విజయనగరానికి చెందిన గండికోట శాంతిని రాష్ట్ర కార్యదర్శిగా, నీలాపు. దేవిని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమిస్తూ నియామక ఉత్తర్వులు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, జిల్లా గో సంరక్షణ సమాఖ్య మహిళా నాయకులు తాలాడ పైడిరాజు, భీమపల్లి సంధ్యారాణి, ఎమ్‌వి మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

అపార నష్టం..అన్నదాతకు కష్టం

- వందల ఎకరాల్లో నీట మునిగిన వరి
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- జలదిగ్బంధంలో ప్రభుత్వ విద్యా సంస్థలు
- కూలిన చెట్లు, ఇళ్లు

గత మూడు రోజులుగా మొంథా తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు రైతులకు అపార నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 4083 ఎకరాల్లో వరి, బొప్పాయి, మొక్కజొన్న, పత్తి, నీలగిరి, సరుగుడు పంటలు దెబ్బతిన్నాయి. బుధవారం వర్షం అధికం కావడంతో గెడ్డలు, వాగులు పొంగిపొర్లాయి. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చంపావతి ఉధృతికి మెంటాడ కెజిబివి, పశువుల పాకలు, నెల్లిమర్ల మండలంలోని మొయిద బిసి బాలుర వసతిగృహం వరద నీరు చేరింది. తెర్లాం మండలంలోని గంగన్నపాడు గ్రామంలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వంగర మండలంలోని మరువాడ సచివాలయం చుట్టూ వరద నీఉ చేరడంతో సిబ్బంది అవస్థలు పడ్డారు.


వేపాడ: సింగరాయి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న పెద్దగెడ్డను పరిశీలిస్తున్న అధికారులు


నెల్లిమర్ల: మొయిదలో నీట మునిగిని బాలుర వసతి గృహం


డెంకాడ: తడిచిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మార్కెఫెడ్ చైర్మన్

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - వేపాడ

గత మూడు రోజులుగా తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు సోంపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం వల్ల వాహనాలు రాకపోకలకు అంతరాయ ఏర్పడింది. సింగరాయి పెద్దగెడ్డ రోడ్డు మీదుగా ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ గెడ్డను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ పరిశీలించారు. కెజిబివి పాఠశాలను ఎంఇఒలు ఎన్ నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు పరిశీలించి తడి చేతులతో గోడలను ముట్టుకోవద్దని సూచించారు. వేడి నీటిని ఇవ్వాలని ప్రిన్సిపాల్ కిరణ్మయికి సూచించారు.

మారిక గిరిజలను ఆదుకోవాలి

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజనులకు సంబంధించి 50 ఎకరాల్లో వరి పంట నీటమునిగిందని ప్రభుత్వం మారిక గిరిజనులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

గంగన్నపాడులో ఎమ్మెల్యే పర్యటన

తెర్లాం: మండలంలోని ముంపునకు గురైన గంగన్నపాడు గ్రామాన్ని ఎమ్మెల్యే బేబినాయన సందర్శించారు. చుట్టు పక్కన ఉన్న చెరువులు నిండిపోవడం వల్ల గ్రామంలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అనంతరం ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపిడిఒ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గంగన్నపాడు, నందబలగలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్నవారికి బుధవారం తెర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రెడ్డి స్వాతి వైద్య సేవలు అందించారు.


ఎస్‌కోట: పాలప్యాకెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే

నీట మునిగిన ఎస్‌సి కాలనీ

గజపతినగరం : మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో గత మూడు రోజులకు కురుస్తున్న భారీ వర్షాలకు ఎస్‌సి కాలనీ నీట మునిగింది. బుధవారం మధ్యాహ్నం విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు తమ సొంత నిధులతో జెసిబి సహాయంతో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

మండలంలోని జగన్నాధపురం, పెంట, అలజంగి, కారాడ, తదితర గ్రామాలలో అక్కడక్కడ వరిపంట నేల మట్టమైంది. పత్తి పంటలో నీరు చేరడంతో ఎక్కువ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు పంటకు కూడా నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరి పంటను పరిశీలించిన ఎమ్మెల్యే, మార్కెఫెడ్ చైర్మన్

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేటలో తుపాను ప్రభావంతో నేలకొరిగిన వరి పంటలను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు బుధవారం పరిశీలించారు. ఆస్తి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడానికి మిల్లర్లకు ఆదేశాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, పల్లె భాస్కరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: నేలకొరిగిన నీలగిరి తోట

72 ఎకరాల్లో వరి పంటకు నష్టం

మండలంలోని 72 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మూడు పురిళ్లు పూర్తిగా పడిపోయాయని, మరో ఆరు పాక్షికంగా దెబ్బతిన్నాయని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. మండలంలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 39 మంది బాధితులకు భోజన ఏర్పాట్లు చేశామని అన్నారు.

సంతకవిటి,పొందూరు రహదారి నిలిపివేత

సంతకవిటి: వర్షాల తీవ్రతతో సిరిపురం గ్రామం వద్ద రెల్లిగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వంతెనపైకి నీరు పొంగి ప్రవహించింది. దీంతో సంతకవిటి నుంచి పొందూరు మధ్య ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండల ప్రత్యేకధికారి డ్వామా పీడీ ఎస్ శారదాదేవి, తహశీల్దార్ బి.సుదర్శన్‌రావు, ఎంపిడిఒ కె.సురేష్ కుమార్ పరిశీలించారు. మండవకురిటీ నుండి జి. సిగడాం వైపుకు వెళ్లే రహదారిపై ఉన్న వంతెనపై కూడా నీరు ప్రవహించడంతో ఆ మార్గం లోనూ రాకపోకలు నిలిచి పోయాయి. అక్కడ కూడా రహదారి ఇరు వైపులా పోలీసులు బేరికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకను నిరోధించారు.

పంట జాగ్రత్తపై శాస్త్రవేత్తల సూచనలు

గంట్యాడ: తుపాను ప్రభావం వల్ల వరి పంటను కాపాడుకోవడం కోసం రావివలస గ్రామ రైతులకు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పలు సూచనలను అందించారు. ప్రస్తుతం వరి పంట పాలు పోసుకొని పూత దశలో గింజ గట్టి పడిన దశలో ఉందని దీన్ని జాగ్రత్తగా కాపాడు కోవాలని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఎఒ బి.శ్యామ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థ పాఠశాలల్లో డేంజర్ జోన్స్ ఏర్పాటు

మెరకముడిదాం: తుపాను నేపథ్యంలో అత్యంత ప్రమాదకరంగా మారిన శిథిలావస్థ, పాడుపడిన, బలహీనమైన పాఠశాలలను బుధవారం ఎంఇఒలు ఎం. చంద్రశేఖర్, టి. ధర్మశ్రీ పరిశీలించి పాఠశాల చుట్టూ రెడ్ రిబ్బన్ కట్టి డేంజర్ జోన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఎంటి రెడ్డి శంకర్రావు, మెసెంజర్ ఉగాది పాల్గొన్నారు.

మడ్డువలసకు పోటెత్తిన వరద

20వేల క్యూసెక్కుల నీరు విడుదల

వంగర: మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి బుధవారం పోటెత్తిన వరద నీరు వచ్చి చేరడంతో ఏడు గేట్లు ఎత్తి 21,600 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి ప్రాజెక్ట్ అధికారులు విడిచిపెట్టారు. ప్రాజెక్టు లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 63.53 లెవెల్ నీటి మట్టం ఉందని ప్రాజెక్టు ఎఇ కె. నితిన్ కుమార్ తెలిపారు.

మరువాడలో చేరిన వరద నీరు

ఎగువ ప్రాంతం నుంచి బుధవారం ఉధృతంగా నీరు ప్రవహించడం వల్ల నదీ తీర గ్రామమైన మరువాడ పశువుల శాలల్లోకి వరద నీరు చేరింది. ఆ గ్రామంలో ఉన్న సచివాలయం చుట్టూ వరద నీరు చేరడంతో ఇళ్లలోకి కూడా వరద నీరు వస్తుందేమోనన్న భయందోళన చెందుతున్నారు.

రైతు కంట కన్నీరు

తుపాను వల్ల మండలంలోని కొప్పర, తలగాం, శివ్వాం, సంగాం, కింజంగి తదితర గ్రామాలలో వరి పంట నేలకు వరగడంతో పాటు, ఆయా పొలాల్లో నీరు చేరడంతో వరి పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయా గ్రామాల రైతులు కంట కన్నీరు పెడుతున్నారు. మండల వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు పలు గ్రామాలలో పర్యటించి వరి పంటలను పరిశీలించారు.

వరి పంటకు అపార నష్టం

మండలంలో 29 గ్రామాల్లో 117 మందికి సంబంధించిన 160.7 ఎకరాల వరి పంట నేలమట్టమయిందని తహశీల్దార్ ఆకుల సులోచన రాణి, ఎఒ ఎ. శ్రావణి తేజ తెలిపారు. అత్యధికంగా గాతాడలో 28 ఎకరాలు, గర్భాంలో 17 ఎకరాలు నీటమునిగిందన్నారు.

నివాస ప్రాంతాలలో వరదనీరు లేకుండా చర్యలు

బొబ్బిలి: నివాస ప్రాంతాలలో వరదనీరు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆదేశించారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి, సాలావారి తోట, అప్పయ్యపేట, పాతబొబ్బిలిలో బుధవారం పర్యటించారు. నివాస ప్రాంతాలలో నీరు నిల్వ ఉండడంతో నీరు బయటకు వెళ్లేలా జెసిబితో పూడికలు తీయించారు.

బొబ్బిలిలో వరిపంటకు స్వల్ప నష్టం

వర్షపు నీరుతో ప్రయాణికుల అవస్థలు

భోగాపురం: మండలంలోని రాజాపులోవ వద్ద రహదారి జలదిగ్బంధనం కావడంతో సిఐ కూన దుర్గప్రసాదరావు నేతృత్వంలో పోలీసులు రోడ్డుపై ఉన్న నీటిని తొలగి ంచే ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం తగ్గిన తరువాత రహదారిపై వాహన రాకపోకలు పునరు ద్ధించారు. ఎమ్మెల్యే లోకం మాధవి, మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు రహదారి వద్దకు చేరుకొని పరిస్థిని సమీక్షించారు. ఈ సమస్యకు శాశ్వత పరిస్కారం కోసం చర్యలు చేపడతామని తెలిపారు.

పోలిపల్లి, చెరుకుపల్లి గ్రామాల్లో వరిచేలు నీటమునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. భోగాపురం ప్రధాన వీధుల్లో మంచినీటి కోనేరు దెబ్బతిని, ఇళ్ల వద్దకు వర్షపు నీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. గోస్తానీ నది ఉధృత వల్ల మండలంలోని గుడివాడ గ్రామ పరిసరాల్లో గట్టు తెగిపోవడంతో వరదనీరు రహదారులపైకి చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గ్రామంలో పరిస్థితిని బుధవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరిశీలించారు.

200 ఎకరాలు వరి పంట నీటిమయం

విద్యార్థుల తరలింపు

మెంటాడ: కెజిబివిలోకి వరద నీరు చేరుకోవడంతో అక్కడి నుంచి 209 మంది విద్యార్థినులను హై స్కూల్‌లో ఏర్పాటుచ చేసిన కంట్రోల్ రూమ్‌కు మంగళవారం అర్ధరాత్రి సమయంలో తరలించారు. ఈ విషయం తెలుసుకున్న గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాస నాయుడు బుధవారం కెజిబివిని పరిశీలించారు.

నీటమునిగిన పశువుల పాకలు

భారీ వర్షాలు కారణంగా ఆంధ్ర రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడంతో 5వేల క్యూసెక్కుల నీటిని చంపావతి నదిలోకి విడుదల చేశారు. దీంతో నదికి అవతలవైపు ఉన్న పశువుల పాకలు నీటమునిగాయి. జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ, ఇటు వంటి పరిస్థితులు మరల పునరావృతం కాకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. చంపావతి నది ఒడ్డున ఉన్న కెజిబివి బాలికల వసతి గృహానికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.


కొత్తవలస: నీలమట్టమైన వరి చేను

నేలకొరిగిన నీలగిరి, సరుగుడు

పూసపాటిరేగ: తుపాను ప్రభావంతో మండ లంలోని లంకలపల్లి పాలెంలో 25 ఎకరాల్లో నీలగిరి, 30 ఎకరాల్లో సరుగుడు తోటలు నేలకొరిగాయి. వెంపడాం, నడిపల్లిలో సుమారుగా 6 ఎకరాలు వరి నెలకొరిగినట్లు వ్యవసాయ అధికారి నీలిమ తెలిపారు. గోవింద పురం, వెంపడం, గుంప గ్రామాల్లో ఉద్యానవన పంటలకు నష్టం జరిగినట్లు రైతులు వాపోతు న్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

కొత్తవలస: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 200 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు కొత్తవలస వ్యవసాయ సబ్ డివిజన్ ఇంచార్జ్ ఎడిఎవి హరికృష్ణ వెల్లడించారు. గాలి కారణంగా మరో 90 ఎకరాలు పంట నేలకొరిగిందన్నారు. పొలాల్లో నీరు నిలవ ఉన్న కారణంగా నష్టం పూర్తిగా అంచనా వేయలేమని నీరు తగ్గిన తర్వాత పూర్తి సమాచారం వెల్లడి చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

జిల్లాలో కురిసిన అకాల వర్షాలతో పొట్ట దశలో ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని విజయనగరం వ్యవసాయ పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త పాత్రో తెలిపారు. ఆయన సీనియర్ శాస్త్రవేత్త అనురాధ, భూసార పరీక్ష శాస్త్రవేత్త సంధ్యారాణితో కలిసి నియోజకవర్గంలో నీట మునిగిన వరి పొలాలను సందర్శించారు.

నేలకొరిగిన చెట్లు.. అప్రమత్తమైన విద్యుత్ శాఖ

మండలంలోని కంటకాపల్లి పంచాయతీ పరిధిలో గల సాంబయ్యపాలెం, జోగయ్యపాలెం, సింహాద్రి నగర్ సమీపంలో చెట్లు నేలకొరగడంతో మంగళవారం రాత్రి ఆయా గ్రామాలో అంధకారంలో మగ్గిపో యాయి. అధికారులు బుధవారం చెట్లను తొలగించి విద్యుత్తును పునరుద్ధరించారు.

వీర సాగరాన్ని పరిశీలించిన అధికారులు

నిండుకుండలా దర్శనమిస్తున్న వీరసాగరాన్ని అధికారులు బుధవారం పరిశీలించి స్థానికు లను అప్రమత్తం చేశారు. చెరువుగట్టు పూర్తిగా తుప్పలతో నిండి ఉన్నందున ట్రాక్టర్ పై వెళ్లి పరిశీలించినట్లు తహ శీల్దార్ పి.అప్పల రాజు, ఆర్ఐ షణ్ముఖ, విఆర్ఒ రాధాకృష్ణ తెలిపారు.

వంతెనలో గుర్రపు డెక్కలు తొలగింపు

రేగిడి: మండలంలోని వేంకంపేట, రేగిడి గ్రామాల సమీపంలో ప్రవహిస్తున్న ఆకులలోవ కట్టగెడ్డ ఉధృతికి రిజర్వాయర్ల నుంచి వచ్చిన గుర్రపు డెక్కలు రేగిడి వంతెనలో కురుకుపోవడంతో వరద నీరు పంట పొలాల్లోకి చేరింది. దీంతో ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పోలీసు సిబ్బంది కొంత మంది గ్రామస్తులు సహకారంతో జెసిబిని పెట్టి గుర్రపు డెక్కను తొలగించారు. వెంకంపేట రహ దారిలో చెట్టు నేలకి వరగడంతో వాటిని జెసిబితో తొలగిం చారు. పలు ముంపు ప్రాంతాలను మండల స్థాయి అధికారులు పరిశీలించారు.

వ్యవసాయ అధికారి వరి పంటలు పరిశీలన

అంబాడ, వెంకటాపురం, పెద్దశిర్లాం, చిన్నశిర్లాం తదితర గ్రామాల్లో వరి పంటలను ఎఒ కె.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. మండలంలోని 182 హెక్టారుల వరి పంటలు ముంపునకు గురి కాగా 120 హెక్టారుల వరి పంటలు నేలకొరిగాయని తెలిపారు. 22 హెక్టారుల చెరకు పంటలు వర్షాలకు నాశనం అయ్యాయని ఎఒ చెపా్రు.

బొప్పాయి నేలమట్టం

గుర్ల: వాన ప్రభావం వల్ల వీచిన గాలులకు పాలవలసలో రెండు ఎకరాల విస్తీర్ణంలో బొప్పాయి తోట నేల కొరిగింది. ఆ గ్రామానికి చెందిన గేదిల అప్పలనాయుడు బొప్పాయి సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి పంట మొత్తం నేల కొరగడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

మండలంలో గడిగెడ్డ ప్రాజెక్ట్‌లో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు దిగిన కొద్దిసేపటికే గల్లంతయ్యారు. చెప్టా పై నుంచి కిందకు జారిపోయారు. అప్పటికే చప్టా కింద చేపలు పడుతున్న స్థానికులు ప్రమాదం గమనించి ఇరువురుని రక్షించారు. యువకులది మెరకముడిదాం మండలం గర్భాంగా గుర్తించారు. ప్రమాద విషయం తెలుసుకున్న తహశీల్దార్ పి.ఆది లక్ష్మీ, ఎంపిడిఒ రవికుమార్, ఎస్ఐ పి.నారాయణరావులు సంఘటన స్థలానికి చేరు కొని గడిగెడ్డలో సన్నానికి దిగిన ఇద్దరు యువకులు నుంచి వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

పొంగుతున్న నదులు, గెడ్డలు

నెల్లిమర్ల: చంపావతి నది, గెడ్డలు ఉప్పొంగుతున్నాయి. ముఖ్యంగా చంపావతి నదికి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ప్రవాహం ఎక్కువైంది. పూతికపేట, మొయిద సమీపంలో గెడ్డ వాగు ప్రమాదస్థాయిలో ప్రవహించి స్థానిక బిసి వసతి గృహంలోకి నీరు చేరి ముంపునకు గురైంది. విద్యార్థులకు సెలవు ఇవ్వడంతో ప్రమాదం తప్పింది. కొండవెలగాడ నుంచి పారసాం, బూరాడ పేట వెళ్లే రహదారిలో గెడ్డ రహదారి మీదుగా ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రవాహాన్ని టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, కడగల ఆనంద్ పరిశీలించారు.

15ఎకరాల్లో వరి పంట నష్టం

తుపాను వల్ల 15 ఎకరాల్లో వరిపంట నష్టం జరిగినట్లు ఎఒ పి. శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె పూతిక పేట, అలుగోలు, ఎటి అగ్రహారం, బొప్పడాం, బూరాడ పేట, ఎన్.ఆల్తిపాలెం గ్రామాల్లో పర్యటించి వరి పంటను పరిశీలించారు.

మత్స్యకారుల కష్టాలపై సిఎం దృష్టి సారించాలి

తుపాను, వేట నిషేధకాం కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని చింతపల్లి గ్రామ సర్పంచ్ బర్రి మసిలి, విజయనగరం జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు, ఫిష్‌కోఫెడ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ బర్రి చిన్నప్పన్న బుధవారం కోరారు. మత్స్యకార కుటుంబాలకు ఉచిత బియ్యంతో పాటు రూ.5వేలు అత్యవసర ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరారు.

రిటర్నింగ్ వాల్ నిర్మించాలి : సిపిఎం

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామ దళిత కాలనీ ముంపునకు గురికాకుండా తక్షణమే రోడ్డు, రిటర్నింగ్ నిర్మించాలని, శాశ్వత పరిష్కారానికై ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ కోరారు. ముంపునకు గురైన దళిత కాలనీను వారు బుధవారం సందర్శించారు. తక్షణమే ఇరిగేషన్ ఎఇతో ఫోన్లో మాట్లాడి రిటర్నింగ్ వాలు, రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు సిహెచ్ రాములమ్మ, సిహెచ్ భవాని, సిహెచ్ గురువులు, ఎం.రమణమ్మ, ఎస్. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


దత్తిరాజేరు: ముంపునకు గురైన ఎస్‌సి కాలనీను పరిశీలిస్తున్న నాయకులు

బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కృష్ణాపురం గ్రామంలో దళిత కాలనీకి చెందిన 30 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. వారికి టిడిపి క్లస్టర్ ఇంచార్జి పెద్దింటి మోహన్ బుధవారం వాటర్ బాటిల్, కొవ్వొత్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

గిరిజనలను ఆదుకోవడంలో చిన్నచూపే..


శృంగవరపు కోట: మండలంలోని దారపర్తి పంచాయతీ గిరిజన గ్రామాల ప్రజలంటే ఎమ్మెల్యేకి, మండల, స్థానిక నాయకులకి చిన్న చూపే. తుపాను దాటికి ఆదుకునే వారు ఉన్న మైదాన ప్రాంతాల్లోనే ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగుతూ వారికి అన్ని విధాల సహకరిస్తున్నారే తప్ప గిరి శిఖర గ్రామాలలో ఉన్న గిరిజనులను మాత్రం పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. దారపర్తి పంచాయతీ పరిధిలోని రాయ పాలెం గ్రామంలో తుపాను ప్రభావంతో ఇళ్లల్లోకి ఊట నీరు చేరి గోడలు నానిపోయి కూలిపోతా యేమోనన్న భయంతో పునరావాస కేంద్రం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంట్లో ఉన్న ఆహార సామాగ్రి మొత్తం, తడిచి పాడైపోయాయి. ప్రభుత్వం స్పందించి, దారపర్తి పంచాయితీలోని గిరిజన గ్రామాలకు ఉచిత రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గౌరీష్, శివ కోరారు.

కూలిన భారీ వృక్షం


పట్టణంలోని కాపు సోంపురం వద్ద విశాఖ అరకు రహదారిలో తుపాను కారణంగా భారీ వృక్షం కూలి రహదారిపై పడింది. సీఐ వి.నారాయణమూర్తి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని చెట్టును తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

ముంపు ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మండలంలోని ముంపు ప్రాంతాలలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టూరిజం బోర్డ్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాజు బుధవారం పర్యటించారు. పోతనాపల్లి, సంతగైరమ్మపేట గ్రామాల్లో పునరావాస శిబిరాన్ని పరిశీలించి ఎమ్మెల్యే తన సొంత నిధులతో భాధితులకు పాలు, పళ్లు, బ్రేడ్స్, చీరలు పంపిణీ చేశారు.


భోగాపురం : రాజాపులోవ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వదర నీరు


గజపతినగరం: పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గేదెల ఈశ్వరరావు


వంగర: మడ్డువలస ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తివేయడంతో దిగువకు పారుతున్న వరద నీరు


గంట్యాడ: రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

వంగర: మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన కడగలరావు (54) కడుపునొప్పి తాళలేక ఈనెల 26న గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 28న మృతి చెందాడని మృతుని భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ శంకర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు వెల్లడించారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని లింగాలవలస గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్న రెండు శిబిరాలపై ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. లింగాలవలస గ్రామ శివారులో చెరువు వద్ద కమ్మలపాకలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. మరొక ప్రదేశంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారి వద్ద నుంచి రూ.10,060 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

పారదర్శకంగా వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

తుపాను కారణంగా వర్షాలు కురుస్తుండడంతో వైద్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారదర్శకంగా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జీవనరాణి ఆదేశించారు. మండల పరిధిలో ఉన్న బూసాయవలస గ్రామంలో బుధవారం ఆమె పర్యటించి అతిసార రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల వల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. మంచినీటి పథకాలకు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. దోమలు నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముచ్చర్లవలస, బూసాయవలలో ఎంత మందికి ఈ డయేరియా సోకిందన్న దానిపై ఆరికతోట వైద్యాధికారి అపర్ణతో మాట్లాడారు. ఈ డయేరియా విజృంభించకుండా ఉండేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆరికతోట పిహెచ్‌సిని తనిఖీ చేశారు. మందులపై ఆరా తీసి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టు పొట్టా కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆకుల సీతంపేటలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడప ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - వేపాడ

లైసెన్స్ మద్యం దుకాణాలలో ప్రతి మద్యం సీసా ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ ఎస్.ఐ విఎన్ రాజు అన్నారు. మండలంలో ఉన్న పలు మద్యం దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. షాపుల నుండి మద్యం గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాబాలలో మద్యం అనుమతించకూడదని చెప్పారు. అనంతరం సురక్ష యాప్ కరపత్రాలను విడుదల చేశారు. వేపాడ, వల్లంపూడి, కృష్ణరాయుడు పేట, అంకాజోష్యులపాలెం గ్రామాల్లో బెల్ట్ షాపులు, నాటుసారా తయారీ కేంద్రాలపై సోదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది వీర్రాజు, హెచ్‌సిబి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న అధికారులు

అన్నదాత ఆక్రందన

ప్రజాశక్తి- రేగిడి

మొంథా తుఫానుతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో చేతికందిన వరి పంటలు ఇలా వర్షార్పణం తో నేలపాలు కావడంతో అన్నదాతలు ఆక్రందన అంతా ఇతా కాదు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి వరి పంటలు పండించామని, రెండు, మూడు రోజుల్లో కోతల కోసి కల్లాలకు చేర్చి నూర్పుళ్ళు పెడదామన్న తరుణంలో ఇలా తుపాను రూపంలో తమ పంటలు పూర్తిగా నేలకు ఒరిగి చాపల ఉండడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. కౌలు రైతులయితే భూ యజమాని దగ్గర ఏడాదికి పంట పొలాలు లీజుకు తీసుకొని వరి పంటలు పండించామని, ఏడాదికి ఎకరాకి 14000 ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో గొల్లపాడు, ఉంగరాడ, కోడిశ, సంకిలి, దేవుదల తదితర గ్రామాల్లో వరి పంటలు నేలకుఒరిగి రైతులు పూర్తిగా నష్టపోయారు. అంబాడ, వెంకటాపురం వరి పంటలు పూర్తిగా నీటిలోనే ఉన్నాయి. ఉన్నతాధికారులు వరి, చెరకు, మొక్కజొన్న పంటల నష్టాలను అంచనా వేసి రైతులను ఆదుకోవాలని మండల రైతుల కోరుతున్నారు.

పంటను పరిశీలించిన కూటమి నాయకులు

ప్రజాశక్తి-వీరఘట్టం

తుపాను తీవ్రత వల్ల నష్టపోయిన క్యాబేజీ పంటను కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, జంప్ చంద్రశేఖర్, సరిపల్లి అచ్యుతరావు, కె.సాయి పవన్, ఉద్యాన శాఖ అధికారులు జయశ్రీ పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వారు భరోసా ఇచ్చారు.

సబ్‌జైలు సందర్శన

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్ జైలు చుట్టూ పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి, ఆరోగ్యం, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉచితంగా న్యాయ సహాయం కావాలంటే ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్యారమ్ బోర్డు, చెస్, మానసిక పరివర్తన కలిగించే పుస్తకాలు ఖైదీలకు అందజేశారు.

సహాయక చర్యల్లో ముందుండాలి : జనసేన

ప్రజాశక్తి-సీతంపేట

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు మొంథా తుపాను సహాయక చర్యల్లో జన సైనికులు ముందుండాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగానికి పార్టీ శ్రేణులు సహకరించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

అడవి పునరుద్ధరణపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలో ఎగువద్వారబంధం గ్రామంలో వాతావరణ మార్పుకు కారణాలు - ప్రభావాల్లో భాగంగా అడవి పునరుద్ధరణ కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక, నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతు వాతావరణ అనుకూలమైన మిశ్రమ తోటలు వేసి అడవిని పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ సవర ఆనందరావు, సిసి బిడ్డిక రామయ్య పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో నీటి సరఫరాకు గురువరాం అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ టి.టి.రత్నకుమార్ తెలిపారు. పెద్దగెడ్డ నుంచి వేగావతి నదికి నీరు విడుదల చేయడం వల్ల ప్రవాహం ఉధృతంగా ఉందని తెలిపారు. బురద నీరు కూడా వస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం పట్టణ ప్రజలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సురక్షిత ప్రాంతాల్లో పశువులను కట్టాలి

ప్రజాశక్తి-కురుపాం

తుపాను నేపథ్యంలో పశువులను బయట ప్రాంతాలకు విడిచిపెట్టకుండా సురక్షితమైన ప్రాంతాల్లోనూ కట్టాలని పశు సంవర్ధక శాఖ ఎడి సంధ్య సూచించారు. బుధవారం మండలంలో ఆవిరి, టొంపలపాడు, వలసబల్లేరు గ్రామాలను వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాడి రైతులతో మాట్లాడారు. తుపాను తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పశువులు ఏమైనా అనారోగ్యం బారిన పడినా, మరణించినా వెంటనే సచివాలయ పరిధిలో పశువైద్య సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్లు అఖిలేష్, నూకరాత్నం, పశువైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

'జంఝావతి'లో పెరిగిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి-కొమరాడ

తుపాను నేపథ్యంలో ఒడిశా ప్రాంతంలో వర్షాలు భారీగా కురవడంతో జంఝావతి నదిలో బుధవారం ఉదయం నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటికే అప్రమత్తమైన రబ్బర్‌డ్యామ్ అధికారులు నీటిని కిందికి విడిచిపెడుతున్నారు. నది పరివాహక ప్రాంతాలైన కోటిపాం, గంగరేగువలస, గుంపగడవలస గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. స్నానానికి నది వద్దకు వెళ్లకూడదని చెప్పారు.

వీడని ఏనుగుల బెంగ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

అడవి ఏనుగుల గుంపు కురుపాం నియోజకవర్గాన్ని వీడటం లేదు. జియ్యమ్మవలస మండలంలోని గవరంపేట, బాసంగి పరిసర ప్రాంతాల్లో ఉన్న అరటి తోటల్లో బుధవారం ఉదయం సంచరించిన ఏనుగుల గుంపు.. సాయంత్రం వెంకటరాజపురం తోటల్లో చేరాయి. పరిసర ప్రాంతాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఏనుగులు కనిపించే సమయంలో ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరారు. ఏనుగుల సంచారంతో తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తూకంలో తక్కువ వచ్చినా పట్టించుకోరా?

ప్రజాశక్తి- చీపురుపల్లి

చీపురుపల్లి పౌరసరఫరాల గోడౌన్ ద్వారా డీలర్లకు సరఫరా చేస్తున్న నిత్యవసర సరుకులలో ప్రత్యేకించి బియ్యం బస్తాలలో మూడు నుంచి నాలుగు కేజీలు వరకు తరుగుదల వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని మెరకముడిదాం మండలం బుదరాయవలస గ్రామానికి చెందిన బూర్ల వెంకట అప్పలనాయుడు అనే డీలర్ బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం తరుగును అధికారులు పట్టించుకోకుండా డీలర్లపైన పెత్తనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తరుగుదల కోసం ప్రశ్నిస్తే నచ్చితే తీసుకువెళ్లండి లేకుంటే మానేయండి అంటూ సంబంధిత అధికారులు డీలర్లను బెదిరిస్తున్నారని వాపోయారు. వాస్తవంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయం మేరకు ఎంఎల్ఎస్ పాయింట్లు నుండి డీలర్లకు అవసరమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన కాటా ద్వారా తూకం వేసుకొని తీసుకు వెళ్ళవలసిన పరిస్థితి ఉన్నప్పటికీ దానికి భిన్నంగా చీపురుపల్లి ఎమ్ఎల్ఎస్ పాయింట్ నుండి తూకం వేయకుండా బియ్యాన్ని తీసుకు వెళ్లాలని గోడౌన్ ఇంచార్జ్ తమపై ఒత్తిడి తీసుకొస్తున్నాడని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో డీలర్ల సంఘాలు ఉన్నప్పటికీ జరుగుతున్న మోసాలను ఎందుకు పట్టించుకోవట్లేదని ఆయన అవవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఫుడ్ కార్పొరేషన్ నుంచి వస్తున్న బియ్యం బస్తాలను తూకం వేయకుండా లారీ నుండి లారీకి బస్తాలను అన్లోడింగ్ చేస్తూ సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను వికలాంగుడు అయినప్పటికీ అధికారుల చర్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనకు సంబంధించి బుధవారం నాడు గోడౌన్ ఇంచార్జ్ కె.సన్యాసినాయుడిని ప్రశ్నించగా గత నాలుగు రోజులుగా గోడౌన్‌లో ఏర్పాటు చేసిన తూనిక యంత్రం మరమ్మత్తులకు గురి కావడంతో ప్రైవేటు తూనిక యంత్రం ద్వారా డీలర్ల ఇష్టపూర్వకం మేరకు నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎటువంటి అక్రమాలకూ పాల్పడడం లేదంటూ ఆయన వివరించారు.



డీలర్ వెంకటప్పలనాయుడు



గోడౌన్ వద్ద బియ్యం బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న కూలీలు



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధి

అథ్లెటిక్స్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక వాగ్దేవి కళాశాల విద్యార్థి జ్యోతిస్వర్ అండర్ -19 అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక వికాసం లభిస్తుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మరిన్ని క్రీడల్లో విజయం సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్, రాజ్ కుమార్, సురేష్, లక్ష్మణ్, ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

కెజిబివి విద్యార్థులకు ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న గుర్ల కెజిబివి విద్యార్థులను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు బుధవారం పరామర్శించారు. కెజిబివిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ అన్ని విద్యా సంస్థలకూ సెలవులు ప్రకటించినప్పటికీ విద్యాశాఖ అధికారులు కెజిబివిలకు, రెసిడెన్షియల్ పాఠశాలలకు సెలవులు ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. అనంతరం ఆయన గుర్ల, మెంటాడ కెజిబివిలను సదర్శించారు. విద్యార్థులను టిడిపి నాయకులు చీకటి సుహాసిని, బిజెపి నాయకులు రాజేష్ వర్మ, మైపాడ ప్రసాద్ తదితరులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, నెల్లిమర్ల మండల ప్రధాన కార్యదర్శి గణేష్, గుర్ల మండల బాధ్యులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- బొబ్బిలి

18వ సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని పోస్టర్‌ను సిఐటియు నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. శంకరరావు మాట్లాడుతూ డిసెంబర్ 31, జనవరి 4, 2026 వరకు ఐదు రోజులపాటు విశాఖపట్నంలో మహాసభలు జరుగనున్నాయని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలకు జాతీయ, అంతర్జాతీయ కార్మిక సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. ఎల్ఐసిలో ప్రజలందరూ దాచుకున్న డబ్బును ఆదానికి 35 వేల కోట్ల రూపాయలు మోడీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ విధ్వంసకర చర్యలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని తెలియజేశారు. ఎండిఎం నాయకులు రామలక్ష్మి, మున్సిపల్ యూనియన్ నాయకులు బి.యుగంధర్, అంగనవాడి యూనియన్ నాయకులు జి.లక్ష్మి, స్కూల్ ఆయా పద్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ఆపద సమయంలో ఆరోపణలా?

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రజలకు ఆపద వాటిల్లే సమయంలో రాజకీయాలను విడనాడి ప్రజలను రక్షించడానికి అందరం కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పార్టీ పరంగా కాకుండా ప్రజల రక్షణార్థం అవసరమైన అత్యవసర సేవలను ముందస్తుగా ఏర్పాటు చేసిందన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాలలో డ్రోన్ సర్వేల ద్వారా పంట నష్టాలను గుర్తించి రైతులను ఆదుకోవడానికి తగిన నివేదికలు తయారు చేయాలని సిఎం చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారన్నారు. నియోజకవర్గం పరిధిలో గుర్ల మండలంలో జరిగిన విద్యుత్ సర్క్యూట్ సంఘటనను వైసిపి నాయకులు రాజకీయం చేస్తూ ప్రజలను పక్కతోవ పట్టించడం సంస్కారం కాదన్నారు. ప్రజలకు ఇబ్బందికరమైన విపత్తు సమయంలో రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలను రక్షించడానికి ప్రతి ఒక్కరం సహకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగాన రామారావు, బీసీ సెల్ అధ్యక్షులు ముల్లు రమణ, గరివిడి మండల నాయకులు పైల బలరాం, సురేష్, చీపురుపల్లి గరివిడి మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ఛాంపియన్‌షిప్‌కు మహిళలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దక్షిణ భారత అంతర్ విశ్వ విద్యాలయాల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు నెల్లిమర్ల మహిళా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల1 వరకు చెన్నైలో జరగబోయే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల కబడ్డీ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు తరుపున పాల్గొనేందుకు నగర పంచాయతీకి చెందిన సోమాదుల భాను, తామాడ భవాణీ, మొయిద శ్రీవల్లి, పాంద్రంకి రమ్య ఎంపికైనట్టు శిక్షకులు, సికెఎంజిజె కాలేజ్ రిటైర్డ్ ఫీజికల్ డైరెక్టర్ బొమ్మన రామారావు తెలిపారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం తరుపున చెన్నైలో పాల్గొననున్న ఆ నలుగురు క్రీడాకారిణులను నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షులు బోని సూర్యనారాయణ నాయుడు, గ్రామ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విద్యార్థుల కుటుంబాలకు

రూ.50 లక్షల చొప్పున పరిహారమివ్వాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్ • కొనసాగుతున్న జీపుయాత్ర

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ఆశ్రమ పాఠశాలలో మృతి చెందిన 16 మంది విద్యార్థులు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జీపుయాత్ర ఏడో రోజు బుధవారం కొనసాగింది. జియ్యమ్మవలస మండలం ఏనుగులగూడ నుంచి కురుపాం మండలంలోకి ప్రవేశించింది. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి, అక్కడ మౌలిక వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలవుతుందా? లేదా? అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేకి రోజుకు రూ.2,500 కేటాయిస్తున్న ప్రభుత్వం.. గిరిజన విద్యార్థులు మెస్‌ఛార్జీలకు మాత్రం 50 రూపాయలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. హాస్టల్ విద్యార్థులకు సరైన ఆహారం అందక ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖాధికారులు ప్రతినెలా వసతిగృహాలను సందర్శించాలని డిమాండ్‌చేశారు. లేకుంటే అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒను కోరారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమిస్తామని మొదటి సంతకం చేసి 15 నెలలైనా అమలు కాలేదని ఆక్షేపించారు. ఇప్పటికైనా ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్‌చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి టి.అఖిల్, బి.అనిల్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో విద్యార్థులకు వేడి భోజనం, తాగడానికి వేడినీరు అందించాలన్నారు. నిరంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతోనే ఉండాలన్నారు. ఎస్ఎఫ్ఐ జీపుయాత్రకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సీతారాం సంఘీభావం తెలిపారు.



కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గంగారావు

జిల్లాల పునర్విభజనలో

పాలకొండకు న్యాయం చేయాలి

మంత్రిని కోరిన పాలకొండ జిల్లా సాధన సమితి

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లాల పునర్విభజనలో పాలకొండకు న్యాయం చేయాలని పాలకొండ జిల్లా సాధన సమితి బృందం మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరింది. సాలూరులో ఆమె క్యాంప్ కార్యాలయంలో మంత్రిని సమితి సభ్యులు బుధవారం కలిశారు. పాలకొండ పాత రెవెన్యూ డివిజన్ ఒక జిల్లాగా చేయాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కోరారు. గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా జిల్లాల విభజన చేసి, పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను మూడు ముక్కలు చేసిందని తెలిపారు. దీనిపై 2020 నుంచి రాజకీయాలకు అతీతంగా జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో పాలకొండ ప్రాంత ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సాధన సమితి గౌరవాధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు, అధ్యక్షులు బుడితి అప్పలనాయుడు, కోశాధికారి సబ్బ నానాజీ, రుంకు రామకృష్ణ, విశ్రాంత సైనికుల ఉద్యోగాల సంఘం పాలకొండ ఉపాధ్యక్షులు వెన్నపు వెంకటరమణ, నాయకులు నెల్లి సత్యంనాయుడు, యందవ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావును కూడా ఇదే విషయమై సమితి సభ్యులు కలిశారు.



మంత్రికి వినతి అందిస్తున్న పాలకొండ జిల్లా సాధన సమితి సభ్యులు

మధుబాలకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఆలిండియా పోలీసు మీట్‌లో కాంస్య పతకం సాధించిన ఎఆర్ కానిస్టేబుల్ మధుబాలను ఎస్‌పి మాధవరెడ్డి అభినందించారు. మరెన్నో విజయాలు సాధించి పోలీస్ శాఖ ఖ్యాతి పెంచాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.



మధుబాలను అభినందిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పంట నష్టం అంచనా వేయాలి



బలిజిపేట.. నేలకొరిగిన వరిచేనును పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

తుపాను నేపథ్యంలో మండలంలో నేలకొరిగిన పంటలను సమగ్ర సర్వే చేపట్టి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఎంపిపి శెట్టి పద్మావతి అధికారులను కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు, ఈదురుగాలులకు మండలంలో ఎక్కడికక్కడ అరటి, మొక్కజొన్న, వరి తదితర పంటలు నేలకొరిగి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు తాత్సారం చేయకుండా, వెంటనే నష్టాన్ని అంచనా వేయాలని చెప్పారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

బలిజిపేట : పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వైసిపి మండల అధ్యక్షులు పి.మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు ఎ.రవికుమార్ కోరారు. బుధవారం మండలంలోని వంతరాం, నారాయణపురం, నూకలవాడ, చిలకలపల్లి, బలిజిపేట, పలగర గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించారు.

పంట నష్టాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి గ్రామాల్లో కెవికె శాస్త్రవేత్తలు ధృవ, ఎస్.స్రవంతి, అమృతవీణ, అనంత విహారితో కలిసి ఎఒ టి.జ్యోత్స్న బుధవారం పర్యటించారు. పంట నష్టాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు.

సీతానగరం : మండలంలోని వెంకటాపురం, ఆర్.వెంకంపేట గ్రామాల్లో ఎఒ ఎస్.అవినాష్‌తో కలిసి కెవికె శాస్త్రవేత్తలు పర్యటించారు. వరి రైతులకు యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు.



సీతానగరం.. రైతులతో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్తలు

పెద్దూరు గిరిజన పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని పెద్దూరు గిరిజన గ్రామ పాఠశాలను బుధవారం సచివాలయ సిబ్బంది పరిశీలించారు. పాఠశాలలో చేరిన వర్షం నీటిపైఐ బుధవారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సిబ్బంది మాట్లాడారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నందున ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, గ్రామంలో ఉన్న చర్చిలో తాత్కాలికంగా పిల్లలకు చదువు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి దిలీప్ కుమార్, విఆర్ఒ జి.రాజేంద్రప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్.రాహుల్ కుమార్ పాల్గొన్నారు.